"అపేక్ష...ఉపేక్ష"

శ్రీ వంగల వేణుగోపాలాచార్య

'జానకీ...'

కాంతయ్య వేసిన ఆ గావుకేకతో జానకమ్మ హడిలిపోయింది. ఇంక తను ఏం మాట్లాడినా పర్యవసానం ఒళ్లు హూనం అవడమే అన్న సంగతి తన యిరవై ఏళ్ల కాపురంలో అనుభవం. అందువల యింకేమీ మాట్లాడకూడదనుకొని, కాంతయ్య తెచ్చిన ఆ పుచ్చువంకాయల కుప్పముందు కూర్చొని ముక్కలు తరిగి, ఏరడం మొదలుపెట్టింది. ఇది అనాదిగా ఆ యింట్లో వస్తున్న ఆచారం. చవకలో తెచ్చిన వీశెల సంఖ్య, కాంతయ్య కొక వ్యవహార దక్షతలా గోచరిస్తే, వాటన్నిటినీ] తరిగి, ఏరి, చివరకి మిగిలిన సవాశేరు కూర పదిమందికీ సద్దలేక జానకమ్మ సతమతమయ్యేది. 'పోనీ...ఆ తెచ్చే నాలుగయినా పెందరాళే వెళ్లి మంచికూరలు ఏరి పట్రాకూడదూ' అనేది జానకమ్మ. 'అది తగని ఖర్చుకి లక్షణం' అని కాంతయ్య వాదం. ఆ వాదం జరిగిన రోజున ఆ యింట్లో భోజనా లుండవు. అదీ కాంతయ్య పట్టు; జానకమ్మ యిక్కట్టు.

తన ఒయీ యిరవై ఏళ్ల కాపురంలోను, పెద్ద సమస్య లేవీ తన కంటకపోయినా, భగవంతు డిచ్చిన కొంపా, గోడా తనకి నామమాత్రంగా కనుపిస్తున్నా, జానకమ్మ మనస్సులో యింకా ఏదో అపరిపూర్ణత వ్యాపించి ఉండేది.

తన మాటకి ఎదురేమీ రాకపోవడంతో, కాంతయ్య యింకో నాలుగు జానకమ్మని తిట్టి, తువ్వాలు దులిపి భుజాన వేసికొని విసురుగా యింట్లోంచి వీధిలోకి నడిచాడు. ఇంక తిరిగిరావడం పొద్దుగూకాకనే. ఇంట్లో పిల్లా—జెల్లా పెద్ద లందరికీ వడ్డించి, వంటిల్లు సద్దుకొని, కాంతయ్యకోసం కళ్లల్లో వత్తులువేసికొని కూర్చోవాలి యిక.

సగం కన్నీళ్లతో పరధ్యానంగాఉన్న జానకమ్మ, కత్తిపీటకి కోసుకున్న వేలిగాయం గమనించనేలేదు.

'అత్తా...'అన్న పిలుపు వినబడి, స్పృహలోకి వచ్చింది. తెలిసింది బాధ. చటుక్కున వేలిని నొక్కి పట్టుకుంది.

'ఉండత్తా' అంటూ అప్పుడే వచ్చిన రమ వెంటనే ఒక పాతగుడ్డ సంపాదించి జానకమ్మ వేలికి చుట్టింది. 'అబ్బా...ఎంత రక్తం కారిందో' అంటూ వేలిని రాస్తోంది రమ. రమ తన ఆడపడుచు కామాక్షమ్మ కూతురు. ఎనిమిదేళ్ల రమ ఎంతో పరిశుభ్రంగా, తెల్లటి పరికిణీ, గౌనులో వెన్నెల శకలంలా మెరిసిపోతున్నది. ఎంతో శ్రద్ధగా వేసిన రెండు జడలు, దీపాకారంలో బొట్టూ, రాళ్ల గాజులూ, కామాక్షమ్మ తనకున్న ఆనందమంతా రమలోనే చూపించిందా అనిపించింది జానకమ్మకి. ఒక్కక్షణం తెప్పరిల్లి 'ఏం తల్లీ...యిలా వచ్చావు' అంది.

'అమ్మ...యిది యిచ్చి రమ్మంది...' అంటూ తెల్లటి స్టీలు గిన్నె పళ్లెం మూతతో అందిచ్చింది. మూత తీయగానే గుభాళింపు ఒక్కసారిగా వెడలింది. ఎంతో జాగ్రత్తగా ఏరిన లేత వంకాయలని తరిగి, అన్ని వస్తువులూవేసి, అన్నగారి కిష్టమని కాంతయ్యకి పంపింది, చెల్లెలు కామాక్షమ్మ. 'మళ్లీవస్తానత్తా' అని రమ వెళ్లిపోయింది.

తనకి వంకాయకూర యింతకంటె బాగా చెయ్యడం తెలుసు. కాని తను పుచ్చువంకాయలు తరుగుతోంది. మనస్సులో ప్రేమ ముంచుకొస్తున్నా, కామాక్షమ్మ పంపిన కూర తనను వెక్కిరిస్తున్నట్టుగా ఊహించుకుంటోంది జానకమ్మ. ఇంత చిన్నవిషయం కూడ మనోవ్యథకి కారణమయింది.

అసలు జానకమ్మకి చిన్నతనంలో ఎన్నో విచిత్ర మయిన ఊహలుండేవి. పుట్టిల్లు జమీందారీకాక పోయినా, ఎంతో సంపన్నంగా వినోదాలతో, విందులతో, నిత్యం ఏవో పండిత గోష్ఠులతో, వచ్చేపోయే అతిధి అభ్యాగతులతో ఎప్పుడూ యిల్లు కిటకిట లాడుతూండేది. చామన చాయలో, తెల్లటి పంచ, శాలువాలో, భారీ అయిన తండ్రి విగ్రహం, ఆయన ఉదాత్తశీలం ఎదుటి వాళ్లెవరినైనా సామంత రాజుల్లా తలవంచేట్టు చేసేది. ఆ ఊరి వాళ్లందరికీ ఆయన తలలోని నాలుకలా వ్యవహరించేవారు. అపర సరస్వతిలా ఆయన వ్యాసపీఠంముందు కూర్చుని పురాణం చెబుతుంటే, ఆ శ్రావ్యకంఠానికీ, విపుల వ్యాఖ్యానికీ ముగ్ధులై, గ్రామస్థులు కదిలేవారేకాదు. అందరికీ ఆయన 'అయ్యగారే.' ఆయన సంతానమంతా ఆడపిల్లలే. అందరిలోనూ జానకమ్మ అంటే ఆయనకి పంచప్రాణాలు. ఇద్దరక్కయ్యలు, ఇద్దరు చెల్లెళ్ల మధ్య...చిన్నప్పుడు చాల అల్లరి చేసేది. పెద్దపనులన్నీ అక్కయ్యలు చేస్తే, చిన్నపనులన్నీ చెల్లెళ్లకి పంచేసి జానకమ్మ రాచకార్యంచేసేది. అప్పటి ఆమె ఊహలు చిత్రాతి విచిత్రంగా ఉండేవి.

...'తానొక మహారాజు కుమార్తెలా, పదిమంది మీద పెత్తనంచేస్తూ, రాజాంతఃపురాలలో నివసించాలి. కలల్లోకూడ కష్టాలు తలవని కలిమిచెలిమిలో జీవితం ఒక అపూర్వ అనుభవాతిలా అత్యంతానందమై వెల్గులు విరజిమ్మాలి. అప్పటి కలలుకూడ, రాజకుమారులు, అంతఃపురాలతో చరిత్రాత్మక చిత్రాలలా వచ్చేవి.'

'అయిదుగు రాడపిల్లల పెళ్లిళ్లు ఎలా చెయ్యాలా' అన్నది సమస్యగా తోచలే దాతండ్రికి. ఎవరో, ఎందుకో, వచ్చేవారు. ఇల్లూ వాకిలీ, సంప్రదాయమూచూసి 'మీ అమ్మాయిని చేసుకుంటాం' అనేవారు. ఈయన 'అలాగే' అనేవారు. అంతే. అది ఒక ఆరుతరాల అనుబంధమయ్యేది. వివాహాలు జరిగేవి. ఏ సరుకులు ఎక్కడినుంచి వచ్చేవో...ఏ పనులు ఎవరు నిర్వహించేవారో... అదొక అపురూప సన్నివేశంలా కల్యాణం జరిగేది. అందరూ పెద్దలే... అందరూ పనివాళ్లే. అది ఒక గ్రామకార్యంలా భాసించేది.

జానకి వివాహంకూడ అలాగే జరిగింది. జీవితంలోని వాస్తవికాలకీ, తన మదిలోని ఊహలకీ పొత్తుకుదరక జానకమ్మ మొదట్లో చాల బాధపడింది. ఇప్పటికీ తన మనస్సు తనకే విచిత్రంగా ఉంది. తన చిన్ననాటి ఊహలు అలాగే ఉన్నాయి. వాస్తవికాలు ఎప్పటిలాగే వ్యతిరేకంగానే ఉన్నాయి. ఈ ఘర్షణలో, తనకి అప్పుడప్పుడు మంచి చెడూ వివక్షతకూడ పోతోంది.

'కాకపోతే, కామాక్షమ్మ పంపిన కూర గుబాళింపులో తనకి కష్టమనిపించడాని కేముందీ...'

ఈ ఆలోచనలతో సతమతమవుతూనే అందరికీ భోజనాలు వడ్డించింది జానకమ్మ. అన్నిపనులు ముగించుకొంది. ఆలస్యంగా వచ్చిన భర్త, తన ముఖంఅయినా చూడకుండా, తను వడ్డించినకూర తింటూ 'కూర బ్రహ్మాండంగా ఉంది. బంగారంలాంటికాయలు చవగ్గా తెస్తే...అతితెలివిపోయి...వంకపెడతావూ' అని వెటకారిస్తుంటే...'ఆ కూర మీ చెల్లెలు పంపిందని' చెప్పాలా...వద్దా...అన్నది తేల్చుకోలేక నిలబడిపోయింది జానకమ్మ.

* * *

'వదినా...'అంటూ చూడవచ్చింది, ఆడపడుచు కామాక్షమ్మ. రోజూ ఏ అయిదార్లుసార్లో అయినా రాకుండా ఉండలేదు కామాక్షమ్మ. ఇరుగు పొరుగు అవడంతో యిళ్లుకలసిఉన్నట్టే అనిపించేది. రాత్రి ఫలహారాలకి పప్పురుబ్బుతున్న జానకమ్మ తలెత్తి చూసింది...

ఇంటిపనులన్నీ ముగించుకొని, భర్తని ఆఫీసుకి పంపి, పిల్లలని బడికిపంపి, తానుభోజనంచేసి, హాయిగా తాంబూలం నములుతూవచ్చిన కామాక్షమ్మ మొహంలో అదొక వికాసమూ, చైతన్యమూ తొణికిసలాడుతున్నయ్.

'నువ్వు లే వదినా. నేను రుబ్బిపెడతాను' అంటూ రోలుముందు కూర్చుంది.

'అలాగే...నేను మరోపని చూసుకుంటా'నంటూ జానకమ్మ లేచి దొడ్లోకి వెళ్లింది పేడ తేవడానికి...

ఇల్లు అలకటం మొదలుపెట్టినప్పటినుంచి జానకమ్మ ఆలోచనలన్నీ, కామాక్షమ్మ యింటిమీదే

ఉన్నాయి. కామాక్షమ్మ యిల్లు చిన్నది. మూడే గదులు...ఇల్లాంతా గచ్చు, ముగ్గుల డిజైనుతో... ఉన్నంతలో ఎన్నో సదుపాయాలు అమర్చుకొంది. 'తనకే అలాంటి యిల్లుంటే ఎంత అందంగా అమర్చుకొని ఉండేది'...

చేతిలో పిడప వదలేసి ఒక్క నిట్టూర్పు వదిలింది జానకమ్మ.

అప్పటికే రుబ్బటం పని పూర్తిచేసివచ్చిన కామాక్షమ్మ అలకటం పని అందిపుచ్చుకొంది.

కామాక్షమ్మకి తన యింటిలో ఏ పనీ చేసుకొనే అవసరం ఉండదు. పనంతా పనివాళ్లో, పిల్లలో చేస్తారు. అన్నగారింటికి వచ్చి, వదినకి సాయం చేస్తూ ఉంటుంది. జానకమ్మకి యిది విచిత్రంగా ఉంటుంది. 'సహజంగా ఆడపడుచుతో ఆగర్భ శత్రుత్వముండాలి'...కామాక్షమ్మ కాపురం చూస్తే తనకి యీర్ష్య కల్గుతున్నదా...ఆ కామాక్షమ్మ నిజంగా దుర్మార్గురాలై ఉంటే...తను ఆమెను నానామాటలు అనే సావకాశం ఉంటే...మనస్సు కాస్త ఊరట చెందేదేమో!

అణగారిన ఆశలు...మనస్సులో ఏవో వికృత రూపాలు పొందుతున్నాయి.

* * *

జానకమ్మ ఒక్కగానొక్క కూతురు ఉమ. ఉమ వివాహమయింది......అదృష్టవంతుడయిన కాంతయ్య కుటుంబీకుడయినా, తండ్రిచాటు బిడ్డే. పెద్దలందరూ చేరి 'కన్యాదాతా...కాంతయ్యా...పీట మీద కూర్చోవయ్యా' అన్నారు. అంతే. కూతురు వివాహమయింది. ఈ విషయంలోకూడ జానకమ్మ ఊహలు ఫలించలేదు. తనకు అల్లుడు ఒక గొప్పవాడయి ఉండాలనీ, తన కూతురయినా యీ అనాగరిక వాతావరణం వదలి, కనీసం కామాక్షమ్మలా సుఖంగా ఉండాలని ఉంది.

వాస్తవిక జగత్తులోని అల్లుడు ఒక సంగీత కళాకోవిదుడై ఎప్పుడూ ఆ స్వరజగత్తులో మైమరచి ఉంటుంటే, తన ఉమకి భావి జీవితంలో యీ అన్నపానీయాలుకూడా కరువవుతాయేమో అని బాధపడేది జానకమ్మ. తాముంటున్నదాక మహానగరం అవటంతో, తన సంగీత సాధనకి కొత్తరూపం కల్గవచ్చునన్న ఆశతో అల్లుడెప్పుడూ యింట్లోనే ఉండేవాడు...దాదాపు యిల్లరికమయ్యాడు.

'తన ఊహాజగత్తులో......ఒక పెద్దమేడా, యింటినిండా దాసదాసీజనం, చూపరుల కళ్లు మిరుమిట్లు గొలిపే సంపదల వైభవాలతో తను హాయిగా భర్త, పిల్లలతో ఆనందంగా బీచికీ, సినిమాలకీ వెడుతూ, రోజు కొక పేరంటం చేస్తూ...'జానకమ్మ చాల గొప్పది...దొడ్డహృదయం కలది' అని అందరూ సేవలు చేస్తుంటే, తను సాటివారిలో ఠీవిగా, అందరి వందనాలు అందుకుంటూంటే, తనవాళ్లు తనను చూసి అసూయపడాలి... తను అది గ్రహించుకొని, ఏమీ ! ఎరుగనట్టు తాను వారిని ఉడికించేయాలి...'కాని వాస్తవంలో వృద్ధులయినా అత్తమామల సేవలూ...వచ్చేపోయే బంధు జనులకి మర్యాదలూ తనకే విషయంలోనూ...ఒక్క కలహానికి తప్ప... అటు సలహాకిగాని యిటు సంప్రదింపులకిగాని తావివ్వని భర్త...అన్నిటినీమించి వేళాపాళా లేకుండా... యింటి సమస్యలతో సంబంధం లేకుండా... నట్టింట్లో కూర్చొని...అల్లుడుచేసే సంగీత సాధనా...ఇవన్నీ జానకమ్మ మనస్సులో ఎన్నో ఆలోచనలు రేపేవి. తాను లేకుండా క్షణం జరగని యీ యింట్లో, తన లెఖ్ఖ ఎవ్వరికీ లేదు. అప్పుడప్పుడు దొడ్లో నూతిలోకి ఒక్కసారి దూకుదామనిపించేది...

...మనస్సులో జరిగే యీ నిరంతర భావ మథనం ఫలితంగా, కాస్త నిశ్చింతగా ఎవరయినా కనపడితే, 'అది వాళ్లు తనని వెక్కిరించడానికి వేసే వేషం'...అనుకునేది. దాంతో ఏవో అయినవీ... కానివీ...సంబంధంలేని సంగతులతో కాలాన్ని నింపుతూ ఉండేది. సాహిత్యంలో భాషకెన్ని అలంకారాలు, నానార్థాలు ఉన్నాయో, అవన్నీ జానకమ్మ నాలుకపై స్వేచ్ఛావిహారం చేసేవి.

'నల్లేరుపై బండిలా...' ఆ ధోరణి కామాక్షమ్మమీదికి తరచూ ప్రవహించేది...పాపం...కామా

క్షమ్మకి, జానకమ్మలోని యీ హృదయ మథనం తెలియక, తను మామూలుగా వస్తూ పోతూ ఉండేది.

*　*　*

కాలాన్ని చక్రంతో పోలుస్తారు విజ్ఞులు. వయస్సు మీరుతున్న కొద్దీ, అనుభవాలు చెరగని ముద్రలు వేస్తున్న కొద్దీ, ఆ కాలానికి యీ చక్ర సామ్యం క్రొంగొత్త అర్థాలతో, భావాలతో ద్యోతక మవుతుంది. జానకమ్మ కాపరానికి సంబంధించినంత వరకు అది ఒక పరమ సత్యం అయింది, అన్నికోణా లలో. చక్ర భ్రమణంలో ఆకులు పైకీ కిందికీ తిరి గినా, వాటిలో స్థానభేదం తప్ప, వస్తుభేదం, తత్వ భేదం ఉండదు.

జానకమ్మ యిప్పుడు తన ఒక్కగా నొక్క కూతురు ఉమ దగ్గరే ఉంటున్నది...గతించిన భర్త ఫోటోలోంచి చూస్తున్నాడన్న తృప్తి తప్ప, ఆయన జ్ఞాపకాలు ఎక్కువగా లేవు.

తన సంగీత సాధనలో పరాకాష్ట నందుకున్న జానకమ్మ అల్లుడు, అనుకోకుండా ఒక సంగీత కళా శాల ప్రిన్సిపాలవడం, యీ కాలభ్రమణాని కొక చిహ్నం...కూతురి కాపురం చూసుకుంటూ, మను మలతో కాలం గడపడమే ధ్యేయం అనుకున్నది జానకమ్మ.

...తాను తొలిరోజుల్లో ఎలాంటి గృహ వాతావరణాన్ని పగటికలలు కన్నదో, ఆ జీవితం, తన కూతురు ఉమకి సాధ్యమయిందన్న విషయం, ఓనాడు, హఠాత్తుగ స్ఫురించింది...

ఆనాడు శనివారం...నిద్రలేచినప్పటినుంచీ జాన కమ్మ మనసు అదోలా ఉంది. ఆలోచనల బరువులో క్రుంగిపోతున్నట్టుంది. హాలులో రేడియో సుప్రభాతం పలుకుతుంటే, తను...తన గదిలో దేవుని మండపం ముందు కూర్చొని భక్తితో స్తోత్రాలు చదువు తోంది...ఇంటిలోని ఉదయం హడావిడి, గదిలోని అగరు, కర్పూరాల సువాసనలూ, దూరంలో మనుమల అల్లరీ...కేకలూ...మేడమీదనుండి వినపడే, అల్లుని వీణ సాధనా, జానకమ్మని తాను ఒక విచిత్రలోకంలో ఉన్నట్టు భ్రమింపచేస్తున్నాయ్.

జానకమ్మ నెమ్మదిగా పూజ ముగించుకొని గదిదాటి వచ్చింది. అప్పటికే పూజ ముగింపుకోసం, గుమ్మంలో కాచుకొని ఉన్న మనుమలు అమ్మమ్మ యిచ్చిన ప్రసాదం అందుకొని, తిరిగి పరుగెత్తుకొని పోయారు, ఆటలకోసం. జానకమ్మ హాలులోకి వచ్చింది...

...అధునాతనంగా అలంకరింపబడిన హాలు, చూసి తృప్తిగా నిట్టూర్పు వదిలింది. మెల్లిగా నడుస్తూ వంటింటివైపు వెళ్ళింది. ఉమ భర్త కోసం ఏదో ఫలహారం చేస్తున్నది. కాల్‌గాస్ పొయ్యి మీద ఒకవైపు వంటయిపోతున్నది. గోడల్లోనే అమర్చిన అలమారులూ...విశాలమయిన అరుగుల మీద అందంగా పేర్చిన ఖరీదయిన సామానూ...

'అమ్మా...కాఫీ తీసుకో' అంటూ మెరుస్తున్న వెండిగ్లాసు అందిచ్చింది ఉమ.

ఆ గ్లాసందుకొని, నెమ్మదిగా నడుస్తూ పెరటిలోనికి వెళ్ళింది జానకమ్మ. ఇంటిచుట్టూ బోలెడు స్థలం. పెరట్లో యింకా పెద్దస్థలం. గేటునుండి పోర్టికోదాకా ఎంతో అందంగా, రకరకాల పూలమొక్కలు పెంచారు. పెరట్లో కూరగాయల పాదులు జానకమ్మ స్వయంగా వేసింది. సహజంగానే, కొబ్బరి, జామ, బొప్పాయి, సీతాఫలంలాంటి చెట్లు ఎన్నో ఉన్నాయి. మిగిలిన స్థలంలో, వాటిమధ్య, ఎంతో నేర్పుగా కూరకాయల పాదులెన్నో పెట్టింది. ఆ నేర్పు, చుట్టుపక్కల వాళ్లనేకాక, తననికూడ ఆశ్చర్యపడేట్టు చేసింది. ఏవేళకాని వేళయినా దొడ్డి అంతా తిరగేస్తే, పదియిళ్లకి సరిపడా కూరలు దొరకుతాయి. నాలుగైదు రోజుల కొకసారి, సన్ని హితులందరికీ, కూరలు పంపకం వేస్తూ ఉంటుంది... జానకమ్మ ఆ దొడ్డినంతా చూసుకుంటూ, తిరిగి, వీధిగేటువయిపు వచ్చింది. అక్కడ ఉన్న నవుకరు ద్వారా కాఫీగ్లాసు యింట్లోకి పంపి, తను పూల మొక్కలన్నిటినీ పరామర్శిస్తోంది.

గేటుదగ్గర రిక్షా ఆగిన చప్పుడయి తిరిగి చూసింది జానకమ్మ. రమ, యిద్దరు పిల్లలతో, రిక్షా దిగుతోంది...రిక్షావాడిని పంపేసి, యింటికేసి నడుస్తున్నది. పిల్లలిద్దరూ పూల మొక్కలు ఉత్సా

హంగా చూస్తూ తల్లివెంట నడుస్తున్నారు... మొక్కల మధ్య ఉన్న జానకమ్మ నెమ్మదిగా వెనుదిరిగి, యింట్లోకి వెళ్ళేసరికి, రమ ఉమలు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. జానకమ్మని చూడగానే, వచ్చి, పాదాలంటి నమస్కరించింది రమ. ఏమేమో చెప్పుకొని పోతున్నది. 'వాళ్ళాయనకి ఆవూరే బదిలీ అయిందట. వచ్చి రెండునెలలయినా, యీనాటికి కాస్త వీలుచిక్కిందట రావడానికి...ఆయనెప్పుడూ కాంపులేగాని... ఊళ్ళో ఉండరట'...ఆదరంగా అన్నీ వింటూనే, రమని పరీక్షగా చూసింది జానకమ్మ. పూర్ణారోగ్యంతో, ఎంతో అందం తొణికిసలాడుతుంటే భేదం ఎరుగని ఆనందంతో వెల్లిపోతున్నదా అన్నట్లుంది రమ.

'అదేమి టత్తా అలా చూస్తావు... నేను... నీ రమని' అంటూ తన యిద్దరుపిల్లలనీ ముందుకు తోసింది రమ. వాళ్ళు ఎంతో బుద్ధిమంతుల్లా నవ్వుతూ తనచుట్టూ తిరిగి ఆడుకుంటున్నారు.

'నే నెల్లాచూశానూ... ఉమా ...హీటర్‌మీద స్టెయిన్‌లెస్ గిన్నెలో పోసిన నాల్గుసేర్లపాలు యింకా కాగలేదూ...త్వరగా కాస్త మీగడతీసి పలకల వెండి గ్లాసులో తీసుకొనిరా తల్లీ...అన్నట్టు మొన్న పండక్కి కొన్న నాల్గు టెరిలిన్ చీరలూ... జాకెట్లూ...బాత్‌రూమ్‌లో పంపుకింద వానిపోతున్నాయి. పనిదానితో వాటిని వెంటనే ఉతకమని చెప్పు'...అంటూ పూజామందిరంలోకి వెళ్ళింది.

అంతవరకూ, రమకి కాఫీ యివ్వబోయిన ఉమ అలాగే నిలబడి వింటోంది. తెల్లబోయి తల్లికేసి చూస్తోంది ఏమీ అర్థంకాక. 'అదే...కాస్త మీగడతే...అంటే పోయేదానికి...అంత దండకమేమిటా అని' అంది ఉమ, 'ఎందుకే...అలా తెల్లబోయి చూస్తావు...ఆత్త నిన్న మీగడ తెమ్మంటే' అన్న రమతో...

ఇంతలో 'నా కండువా ఏదీ' అంటూ ఉమాపతి రావడంతో వాళ్ళ సంభాషణ ఆపి పనుల్లో నిమగ్నులయ్యారు.

* * *

ఒకనాడు అనుకోకుండా, రమా ఉమా సినీమా హాలులో కలిశారు. వాళ్ళ భర్తలు సినిమా చూడ్డంలో మునిగిఉన్నారు.

సంబంధం లేకపోయినా యిద్దరాడవాళ్ళు కలిసి మాట్లాడుకున్నట్లు మగవాళ్ళు కలియరు. అలాంటిది, రమ ఉమ చిన్నప్పటినుంచి ఒక్కచోట పెరిగారేమో...బాంధవ్యకంటే స్నేహం ఎక్కువయిన వాళ్ళు, 'ఏమే రమా...మీ యింటికి వద్దామనుకున్నానే...నువ్వేమో మళ్ళీ రాలేదు'...' అని ఉమ అంటే, నేనూ వద్దామనుకున్నా...కాని...యిదిగో... మీ అన్నగారు క్యాంపులు మానేసి యింట్లో కూర్చున్నారు...ఏంచెయ్యను' అంది రమ నవ్వుతూ...

ఈ నవ్వులో రమాపతీ, ఉమాపతీ, మాటలు కలిసి, లోకాభిరామాయణంలో పడ్డారు. సినిమాలోని సంగీతాన్ని ఉమాపతి విమర్శిస్తుంటే...అందులోని సాహిత్యాన్ని రమాపతి మెచ్చుకుంటున్నాడు. సినిమా వదలగానే అందరూ హాలుబయటికి వచ్చారు.

'ఉమా...ఇప్పుడింక యింటికి ఏంవెడతారే... యీపూటకి మాయింటికి రండి. పొద్దున్నే వెడుదురుగాని' అంది రమ.

రమాపతి, ఉమాపతిని బలవంతంచేసి ఒప్పించాడు చివరకి...

* * *

సినిమాకి వెళ్ళిన నాటి రాత్రి యింటికి రాకుండా, అల్లుడూ కూతురూ, రమ వాళ్ళింట్లో గడపారన్న విషయం తెలిసినప్పటినుంచి, అదేదో జరుగరానిపని జరిగినట్టు భావించ సాగింది జానకమ్మ. ఆ భావాన్ని ఎంత గుప్తధోరణుల్లో ఉంచుదామన్నా, ఉమకి యీ విషయం స్పష్టంగా తెలిసిపోతూనే ఉంది.

'ఎందుకే అమ్మా...అంత బాధపడతావు? రమ ఏమన్నా పరాయిదా? ఎప్పుడూ వాళ్ళయింటికి వెళ్ళలేదుకదా అని, సరదాగా వెళ్ళాము. ఈ విషయం రమకి తెలుస్తే ఎంత బాధపడుతుందో' అన్నది ఉమ తల్లితో.

ఉమ అన్నదాంట్లో నిజం ఉందని జానకమ్మకి తెలుసు. ప్రత్యేకించి రమ వాళ్ళమీద యింత ఉపేక్ష

ఎందుకు? జానకమ్మ హృదయంలో ఎన్నో విరుద్ధ భావాలు కల్లోలంగా ఉన్నాయ్.

* * *

మరునాడు ఉదయమే, వియ్యంకుడు పోయాడన్న టెలిగ్రాం చూసుకొని, అల్లుడూ కూతురూ, స్వస్థలం వెళ్ళారు. పిల్లలని చూసుకుంటూ జానకమ్మ ఉండి పోయింది ఒంటరిగా. ఈ విషయం తెలిసిన రమ, వెంటనే వచ్చి, జానకమ్మకి సాయంగా ఉంటోంది. జానకమ్మ పూజాదికాలు ముగించుకొని వచ్చేటప్పటికి, పాలు సిద్ధంగా ఉంచేది. ఆమె పెరడులోని మొక్క లన్నిటినీ పరామర్శించి వచ్చేటప్పటికి, రమ పిల్లలూ, ఉమ పిల్లలూ...తమ తగాదాలు తీర్చమంటూ వచ్చే వారు. తన కూతురు పిల్లలతో సమానంగా రమ పిల్లలు ఆడుతుంటే.....తిరుగుతుంటే.... ఆ పసి హృదయాలు వారి మరోలోకంలో విహరిస్తుంటే... తన కెందుకో రక్కుకుంటున్నట్టుండేది జాన కమ్మకి....

...ఆ నాటిరాత్రి పెద్ద గాలి వానా వచ్చాయి. పిడుగులు ఉరుములతో నానాబీభత్సంగా, కుండపోతలా వర్షం....తుఫాను గాలుల మధ్య....ఎంతో ఆలస్యంగా తెల్లవారింది.

జానకమ్మ పెందలకడే లేచి, తోటలోకి వెళ్ళింది. తోటంతా నానాబీభత్సంగా ఉంది. తాను ఎంత శ్రద్ధగానో ప్రోదిచేసి, పెంచిన మొక్కలన్నీ సమూ లంగా లాగబడి ఉన్నాయి. అక్కడా...అక్కడా కొన్ని మొక్కలుమాత్రం నిస్సహాయంగా వ్రాలిఉన్నాయి. ఇదంతా స్తబ్ధహృదయంతో, నిలబడిపోయి చూస్తున్న జానకమ్మకి, మనస్సులో ఒక భావన మెరిసింది ...

...హఠాత్తుగా భర్త పోవడంతో తన జీవితం యిలానే అయిందికదా...అని. ఇప్పుడాయనే ఉంటే, తన గారాలకూతురి కాపురంచూసి, అల్లుని హోదా చూసి ఎంత సంతోషించి ఉండేవారో...వెంటనే మనస్సులో ఒక కారుమేఘం క్షణం మెరిసి మాయ మయ్యింది...ఆయన క్రోధాధికం యిప్పటికి మరీ వృద్ధి అయిఉండేదేమో...కాని ఆ భావం భర్త స్మృతి భావ భారంక్రింద నిలవలేదు. జానకమ్మ మన స్సంతా ఆ నాడు వికలంగానే ఉంది. అన్నంకూడా సరిగా తినలేదు.

...ఆనాడు సాయంకాలం...తన తోటలో కనపడ్డ ఓదృశ్యం చూసి విస్తుపోయింది జానకమ్మ... రమ, ఆమె పిల్లలూ, ఉమ పిల్లలూ...అందరూ కలిసి హడావిడిగ తోటంతా బాగు చేస్తున్నారు. పాత తీగలు లాగేయడం...పందిళ్ళు సరిచేయడం...కొన ఊపిరితో ఉన్న తీగెలని జాగ్రత్తగా సాకించడం...దారు లన్నీ ఉత్సాహంగా ఊడ్చేస్తున్నారు. అందరి మొహా ల్లోనూ ఆనందం ఉత్సాహం గోచరిస్తోంది.. రమ పిల్లలతో సమానంగా ఆనందంతో, ఆ తోటకి ఒక రూపు తీరుద్దామని కృషి చేస్తున్నది...'యిదిగో... అమ్మలూ...అత్త వచ్చేటప్పటికి యీ తోటంతా కళ కళలాడుతూ ఉండాలి...' అని హెచ్చరికలు చేస్తోంది...

ఆ దృశ్యం చూస్తున్న జానకమ్మ హృదయంలో ఎంతో సంతోషం కల్గింది. తనూ వెళ్ళి ఎంతో ఉత్సాహంగా పాటుపడింది. అందరూ కలిసి తోటకి తిరిగి పూర్వపు రూపం కల్పించారు.

...ఆ రాత్రి ... నిద్రపోతున్న జానకమ్మకి ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది. అప్పుడే గోడ గడియారం ఒంటిగంట కొట్టింది. గడియారం ప్రక్కగా, అటూ, యిటూ తన భర్త ఫోటో, వియ్యంకుడి ఫోటోలున్నాయి. 'వారిద్దరూ యీనాడు లోకంలో లేరు. కొంతకాలంపోతే తనూ ఉండదు...ఎవరు మాత్రం శాశ్వతంగా యిహంలో ఉండిపోతారు? ఉన్న నాల్గునాళ్ళలో యిన్ని ద్వేషాలు, కార్పణ్యాలు పెంచు కొంటే కలసివచ్చేదేముంది? చిన్నపిల్లల్లో ఉన్న రాగాలూ...అనురాగాలూ: పెంచితే...అవే వాళ్ళకి ప్రశాంత జీవితాలనిస్తాయి. వారి ఔన్నత్యాలకి ఆధార

భూతాలవుతాయి. మనస్సుల్లోనే విషబిందువులు చిందించుకోవడం...చిందింపజేయడం మానవత్వం అనిపించుకోదు...జీవితంలో సగం దరిద్రంతో...పేలవంగా గడవడంతో...అది తీసిన బీటలలో సుగుణాలు యిరుక్కుపోయాయి.

...నిరంతరంగా జరిగే యీ భ్రమణ, పరిభ్రమణాల్లో విశ్వంలో ఏ అణువూ...ఏ తత్వమూ...స్థిరంగా...శాశ్వతంగా ఉండదు. ఆది ఎప్పుడూ, విశ్వశ్రేయస్సుకై పరిణామబద్ధమై ఉంటుంది... కాని స్థిరంగా ఉండేది...యిరుసు కేంద్రంలాంటి ప్రేమైక హృదయం మాత్రమే......తన మనస్సులోని విరుద్ధ భావాల ఘర్షణల్లో తట్టులా తేలిన మలినాన్ని, తానే తీవ్రమైన ఆలోచనలతోనూ, పెంచుకొన్న ప్రేమశక్తితోనూ క్షాళనం చేసుకొంది... అయినా, అయినవాళ్ల హృదయాలు ముక్కలు చేయకముందే మేల్కొంది జానకమ్మ ... లోకానికి అప్పుడే తెల్లవారింది....

* * *

ఒక విధమయిన వింత తేజస్సుతో, అపర యోగినిలా వెలిగిపోతున్న జానకమ్మని పూజామందిరంలో చూసి రమ, తనకి తెలియకుండానే చేతులెత్తి నమస్కరించింది.......